# ★ విపరీతపు పెళ్ళి ★

శ్రీమతి చిట్టూరి అన్నపూర్ణా దేవి

"అత్తయ్యా !" అన్నాడు కుమార్ లోపలికి అడుగు పెడుతూనే ఎదురుగా మంచంమీద మూలుగుతున్న మేనత్త అన్నపూర్ణమ్మను చూచి. ఆమె నెమ్మదిగా "ఏం నాయనా ! వచ్చావా. యిలా కూర్చో నిన్ను చూస్తానో చూడనో అనుకొన్నాను" అంది. కుమార్ చేతిలోనిసంచి క్రిందపెట్టి మంచందగ్గరగా నున్న కుర్చీలో కూర్చొంటూ "అలా అనకు అత్తయ్యా ! ధైర్యంగా వుండాలి. ఒంట్లో ఎలాగుందీ ?'' "ఏం చెప్పను నాయనా ! అన్ని విధాలైన బాధలు నన్నావరించాయి. నిన్నటినుండి నాకు మనస్సు స్థిమితంకూడా తప్పింది. నాకిలా ఉందని నీకెలా తెలిసింది ?"

"నాన్న ఉత్తరం రాశారు"

"అన్నట్టు నాన్నస్థితి ఎలాగుంది"

"ఆయనకొరకు మద్రాసులో నేను డాక్టరును సలహా అడిగాను; స్థలంమార్చితే ఆయన ఆరోగ్యం బాగుపడు తుందన్నారు. అందుకని నాన్నని నీలగిరి తీసుకెళ్ళామని నిశ్చయించాను"

"అమ్మ వప్పుకుందా ?"

"ఆమె ఏమాట వింటుంది కనక ఈమాట వినడానికి ? అత్తయ్యా ! డబ్బు ఖర్చుట. యీ వూళ్ళోనే ఉండి ఏదో ఒకమందు యిప్పించాలట. "బాగానే ఉంది !" అంటూ "అమ్మా'' అని మూలిగి నీరసంగా ఊరుకుంది. పిలిస్తే పలకలేదు. ఇంతలో చెఱువునుండి నీళ్ళుతెచ్చిన గిరిజ కుమార్‌నుచూచి "ఎప్పుడొచ్చావు బావా" అంది.

"ఇప్పుడేగాని. అత్తయ్య యింతవరకు మాట్లాడి యిప్పటికి యిప్పుడే మాట్లాడ్డంలేదు. చూడు" అన్నాడు.

ఆమె బిందె దించి వచ్చి తల్లినిచూచిఅంది "మూడు రోజులనుండి యిదేస్థితి. పదినిమషాలుపోతే మళ్ళీ యీ ప్రపంచంలో పడుతుంది."

"మరి మందెవరిస్తున్నారు ?"

"మందా !" అని నిట్టూర్చి ఊరుకుంది.

"అలా అంటావేమిటి గిరిజా !"

"ఏం పెట్టి యిప్పించమంటావు బావా ?"

"ఏం మాట్లాడుతున్నావు గిరిజా !'' అన్నాడు ఆమె ముఖంలోకి చూస్తూ.

"ఉన్న విషయమే"

"మా నాన్నను అడగలేదా ?"

"అడగకుండానే మావయ్య తన శక్తికొలది సాయం చేశారు."

"శక్తి ఏమిటి ఆపదలో ఉన్న అప్పచెల్లెలను ఆదుకో డానికి !''

"ఎలా జరగవలసింది అలా జరుగుతుంది. కాని కాళ్ళు కడుగుకో బావా !'' అతడు మారుమాటాడకుండా పెరట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కొని పీటమీద కూర్చు న్నాడు. అన్నం వడ్డిస్తున్న గిరిజతో "ఒక ఉత్తరం అయినా నాకు వ్రాయకూడదా ?" ఆమె ఏజవాబు యివ్వ లేదు.

"అయితే నన్ను పరాయివానిగా చూస్తున్నావు. చిన్నప్పటి అన్యోన్యతయినా జ్ఞాపకంలేదా ?"

"నేనెలాగు వ్రాసేది బావా ?"

"యింతప్రశ్నే వస్తే నేనెవరిని ! నీవెవరివి !" అన్నాడు అన్నం కలుపుతూ. "అలా అనకుబావా ! పరిస్థి తులను అర్థంచేసుకో ! అంతకంటే ఏం చెప్పను.''

"తెలిసింది" అంటూ అన్నం తీశాడు. నోట్లో పెట్టుకో బోతుండగా "ఏం నీకు పిళ్ళేమయినా మందుపెట్టారా ? యిలు కనిపించలేదా ? [illegible]

విని చేతిలోముద్ద క్రిందపడిపోయింది. ఆశ్చర్యంతో కుమార్ తలపైకెత్తాడు. ఎదురుగా తల్లినిచూచి "ఎందు కమ్మా యీ కోపం ?" అన్నాడు.

"ఇంకా ఎందుకు కోపం అని అడుగుతున్నావా. వీళ్ళనీకు చాటుగా ఉత్తరాలు వ్రాయగానే వచ్చేయడం, వచ్చినవాడివి తిన్నగా యిక్కడకే రావడం చాలా బాగుంది."

"అమ్మా పొరబడుతున్నావు. వీళ్ళెవరు ఉత్తరాలు వ్రాయలేదు నాకు"

"అయితే నీకేమైనా కర్ణపిశాచం ఉందా ?"

"కర్ణపిశాచంలేదు ఏమిలేదు. నాన్న వ్రాసిన ఉత్తరంలో అన్ని సంగతులతో పాటు యీ సంగతికూడా వ్రాసేరు."

"ఆ! ఆ!! ఎంతటివాళ్ళు! మీరందరు ఒకటే! నేనేగా చెడ్డదాన్ని, సరేగాని యింట్లో పాలు, పెరుగు, నేయి చేదు అయ్యాయి. ఇక్కడ యీపచ్చడి, మజ్జిగ మెతుకులు పరమాన్న మయాయి కదూ ?"

"ప్రేమతో పెట్టింది ఏదయితేనేమమ్మా" అన్నాడు కుమార్ చిరునవ్వుతో.

"చాల్లే ! నీ నీతులు చేయి కడుక్కొని పద యింటికి"

"యిదుగో ఒక్కనిముషంలో భోంచేసి వస్తాను. యింతలో నీవు అత్తయ్యను చూడు."

"ఏమిటి చూచేది. అందరం రేపు చచ్చేవాళ్ళమే"

"అందుకేనమ్మా"

"ఎందుకు ?"

"అందరం రేపు చచ్చేవాళ్ళమేగనక, చచ్చేవాళ్ళను దయతో చూడడం..." అంటూండగానే.

"ఇక నీ చదువుకున్న తెలివితేటలు ఆపు" అంది తల్లి. చేయి తుడుచుకుంటున్న కుమార్‌తో "త్వరగా పద యింటికి" అంది తల్లి మళ్ళీ.

"డాక్టరుకు కబురుపెట్టాను. రానీ మాట్లాడి వెళ్ళి పోదాము."

"విషయం చాలావరకు వచ్చింది. సరే నీయిష్ట ప్రకారమే కానియి" అంటూ విసురుగా వెళ్ళిపోయింది. గిరిజ కుమార్‌ని సమీపించి "నీవు యింటికి వెళ్ళుబావా" అంది. "నేనిక్కడ ఉండడం యిష్టంలేకపోతే తిన్నగా [illegible]"

"ఉద్రేకంగా కాక శాంతంగా ఆలోచించు బావా"

"మహా అపరగాంధి అవతరించినట్టున్నావు! మా అమ్మ సంగతి నాకు బాగా తెలుసు. ఆమెను మార్చలేక పోగా నేను కూడా పశువునుకాలేను." అన్నాడు కోపంగా.

ఇంతలో గిరిజ తల్లి పెద్దగా అరవడంచేత ఇద్దరు అటే పరుగెత్తారు. ఏముంది గిరిజ తల్లి మృత శరీరాన్ని మంచం మీద చూచి గిరిజ "అమ్మా" అని తల్లి శవంమీద పడి గుండె పగిలేలాగు ఏడ్వడం మొదలుపెట్టింది. అప్పుడే లోపలికి వచ్చిన డాక్టరు వెనక్కు తిరిగి వెళ్ళి పోయాడు.

* * *

"అయితే నేను పంపే డాక్టరు చెప్పినట్లు చేస్తారు కదూ?"

"తప్పకుండ అలాగేచేస్తాను."

"ఎప్పటి కప్పుడు ఉత్తరాలు రాస్తుంటారు కదూ?"

"ఎప్పటి సంగతులప్పుడు తెలియ జేస్తాను. నీవు మాత్రం నిశ్చింతతో చదువుకుంటూ వుండు."

"అయితే యిక నేను వస్తాను" అని తల్లికి చెప్పి బయటకు వెళుతున్న కుమార్‌ని పిలిచి "చూడు! నాయనా —గిరిజకు కూడా చెప్పివెళ్ళు" అన్నాడు తండ్రి. "సరే" అని వెళ్ళిపోయాడు కుమార్.

గిరిజ గులాబి మొక్కలకు నీళ్ళుపోస్తూ "గిరిజా" అన్న పిలుపు విని కుండ అక్కడ పెట్టి ఎదురుగా నిలబడిన కుమార్‌ని "రా బావా" అంది. కుమార్ లోపలికి గిరిజ వెనకే వెళ్ళి కుర్చీమీద కూర్చున్నాడు.

"వెళ్ళిపోతున్నావా బావా?" అడిగింది. గిరిజ

"అవును చెప్పిపోదామని వచ్చాను"

"మళ్ళీ ఎప్పుడొస్తావు?"

"నీవు ఎప్పుడు రమ్మంటే అప్పుడు" చిరునవ్వుతో అన్నాడు.

"నేను రమ్మనడంకాదు అసలెప్పుడు వస్తావు అంట?"

"నిన్ను చూడా లనుకున్నప్పుడు"

"బాగానే ఉంది"

"సరేకాని ఉత్తరాలు వ్రాయడం మర్చిపోకు గిరిజా! జరిగిపోయిన వాటిని మరచిపోయి నీకే అవసరం వచ్చినా నాకు వ్రాయి"

"నాకు అవసరాలేముంటాయిలే బావా"

"అయితే నా అవసరాన్ని బట్టి నేనే వ్రాస్తాలే"

"నీకు మాత్రం ఏం అవసరముంది?"

"నీ మాటలకు అర్థమేమిటి గిరిజా"

"అర్థం బయటకు చెప్పేకంటే హృదయంలో తెలుసుకుని ఊరుకోవడమే మంచిది"

"గిరిజా! నా పరీక్షలు వచ్చేఏడాదితోసరి తరువాత మన ........." అని ఊరుకున్నాడు.

"మన ఏమిటి బావా"

"పెళ్ళి" అన్నాడు ధృఢంగా

"పెళ్ళి! సరే బ్రతికి బాగుంటే అలాగే" అంది గంభీరంగా.

"నీవు మాటాడే ప్రతీ మాట నా హృదయాన్ని ఎంత బాధిస్తుందో తెలుసుకొని మాటాడు గిరిజా."

"బాధలే నా జీవితం. యిక బాధల విలువ నాకేం తెలుస్తుంది బావా?" కుమార్ లేచి గిరిజను సమీపించి ఆమె చేతిని తన చేతిలోనికి తీసుకొని "గిరిజా! నీవెప్పుడు నన్ను అపార్థం చేసుకోకు. నిన్ను తప్ప మరెవ్వరిని పెండ్లాడను. ఆమె సమాధానం చెప్పలేదు.

"యికనేను వస్తాను. ఉత్తరాలు తప్పక వ్రాస్తూఉండు" అన్నాడు యింతలో బండివాడి పిలుపువిని "వస్తాను గిరిజా" అని వెళ్ళిపోతూ వెనక్కి తిగిరి చూచాడు. ఆమె కళ్ళలో మిలమిలా మెరుస్తున్న రెండు కన్నీటి బిందువులు చూచి బాధతో బండెక్కాడు.

వెళ్ళిపోతున్న పోస్టుమేన్‌ను వెనక్కు పిలిచి అటు ఇటు చూచి ఐదురూపాయల నోటు అతనిచేతిలో పెడ్తూ "గిరిజకు ఏఉత్తరంవచ్చినా నాకిచ్చేయడం మరచిపోకూ" అంది లక్షమ్మ. "అయ్యోతల్లి! యింకా మర్చిపోతానా!" అన్నాడు వెళ్ళిపోతూ.

చెరువులో నీళ్ళు ముంచుకు బయటకు వస్తూ గిరిజ పోస్టుమేన్‌ను చూచి "నాకేమన్నా ఉత్తరాలువచ్చాయా?" అంది గిరిజ. "వస్తే ఉంచుకుంటానా?" అని వెళ్ళిపోయాడు. పోస్టుమేన్.

*　　　*　　　*

"ఏమండోయి! మేనకోడలువచ్చింది"అంది లక్ష్మమ్మ. నారాయణరావుగారు కళ్ళుతెరచి ఎదురుగా గిరిజనుచూచి "ఏవమ్మా చాలరోజులకొచ్చావు?" "ఏమిలేదు మామయ్యా మీతో ఒకమాట చెప్పదామని" "....."

"నేనక్కడ ఒంటరిగా ఉండలేను మామయ్యా! మీ నీడలోనే ఉంచామని అత్తయ్యని అడిగాను. అత్తయ్య ఉండి పొమ్మాన్నారు. యిక తల్లిఅయినా తండ్రి అయిన మీరేనాకు" అంది. "తప్పకుండా యిక్కడే ఉండు తల్లీ" అన్నాడు. డాక్టర్ లోపలికి రావడంచే ఆడవాళ్ళిద్దరు అవతలకు తప్పుకున్నారు.

*　　　*　　　*

"లక్ష్మి! చూచావా బావ ఏంచేశాడో" అంది గిరిజ స్నేహితురాలితో.

"ఏమయింది ఏంచేశాడు"

"యింతవరకు నీతో చెప్పలేదు. సరిగ్గా యీ రోజుకు బావవెళ్ళి 9 నెలలైంది. కాని ఒక్క ఉత్తరమైన వ్రాయలేదు. అంతేకాదు మామయ్యవాళ్ళకు వ్రాసే ఉత్తరంలోనైన నాపేరు ఎత్తడంలేదు." లక్ష్మి ఆశ్చర్య పోయి "ఎందుచేత?" అంది.

"ఎందు చేతేముంది గతిమాలిన వాళ్ళను గుర్తుంచుకుందేవరకు అతనికి ఏమి అవసరం లక్ష్మీ!"

"అలా అనకు. కుమార్ చాల మంచివాడు. అతని హృదయం విశాలమైంది"

"యింతకు పూర్వం నేనూ అలాగే అనుకున్నాను. కాని........" అని ఊరుకుంది. లక్ష్మి ఏదో ఆలోచించి అంది "కుమార్ వ్రాసిన ఉత్తరాలను మీ అత్త చించి పారేయటంలేదు కదా?"

"ఏమీ తెలియనిదే అపోహపడటం ఎందుకు?"

"అలా అనకు గిరిజా, మీ అత్త ఎంతటిదికాకపోతే ఆ ఏభైయేళ్ళ ముసలివాడ్ని నీకు వరుడుగా మాట్లాడుతుంది?" గిరిజ గుండె ఆగినంతపనైంది. ఆశ్చర్యంతో అడిగింది. "నా కింతవరకు తెలియదే. నీ కెలాతెలిసిందీ విషయం?"

"పిచ్చిదానా! ఎద్దునడిగి గంతలు కడతారా? మా ఆడబిడ్డ దయ్యం ఒకటుందిగా ఆ సంబంధం తెచ్చింది ఆమేలే!"

"నీవు చెప్పేది నిజమేనా లక్ష్మీ!"

"నిజమే.నీకు ఎప్పుడో చెపుదామనుకున్నాను. కాని నీకు ఈ సంగతి తెలుసునని, కుమార్‌కి వ్రాశావనీ అనుకున్నాను. యిప్పుడైనా కుమార్‌కి ఉత్తరం వ్రాయి"

"నే వ్రాయలేను. నా నొసట ఏది వ్రాసుంటే అలాగే

"ఇప్పుడు పంతం పడితే లాభంలేదు. వెంటనే ఈ సంగతి తెలియచేయి"

"బావకు యిష్టంలేనప్పుడు బలవంతం చేయడం నాకిష్టంలేదు" అంటూండగా నౌకరు కుర్రాడు "పుట్టలో పాలుపోసి త్వరగా రమ్మన్నారు అమ్మగారు" అన్నాడు.

"మావయ్య కెలా ఉంది ?"

"అయ్యగారు బాగానే ఉన్నారు. ఎవరో చుట్టాలు వచ్చారు"

"వస్తా లక్ష్మీ" అంది గిరిజ.

"వెళ్ళిరా. జాగ్రత్తగా ఆలోచించి వ్యవహరించు"

"అన్నిటికి భగవంతుడే ఉన్నాడు" అంటూ వెళ్ళిపోయింది గిరిజ.

* * *

గిరిజ పెండ్లికూతురయింది. అందరూ చూచి వెళుతున్నారు. లక్ష్మీకూడా వచ్చింది చూడ్డానికి. గిరిజని సమీపించి "నీ చేతులతో నీవే ఉరివేసుకుంటున్నావు కదూ ?" అంది. గిరిజ మాట్లాడలేదు. ఆమె కండ్లు కన్నీటిని వర్షించాయి. గాద్గదికంగా అంది "ఎంత ప్రయత్నించిన బావను చేసుకోలేను. నా కోరిక తీరనిది" లక్ష్మి కళ్ళు చెమ్మగిల్లాయి. "నీవు వ్రాస్తే కుమార్ వచ్చి తప్పక విషయాన్ని చక్కదిద్దగలడు." "ఏం చక్కదిద్దగలడు? తల్లితో తగవుపెట్టుకుంటాడు. యీ తగవుల మధ్య మామయ్య ప్రాణాలే విడిచిపెట్టవచ్చు." "అవన్నీ ఆలోచించి నీకు నీవేకాక కుమార్‌కు కూడా అన్యాయం చేస్తున్నావు గిరిజా !"

"అన్యాయంకాదు లక్ష్మీ ! నేనొక్కదాన్ని తప్పుకుంటే యీ కుటుంబం శాంతిగాఉంటుంది." యింతలో లక్ష్మమ్మ అటు రావడంచేత స్నేహితురాళ్ళు విషయాన్నిమార్చారు. లక్ష్మి "వెడుతున్నాను" అని చెప్పి వెళ్ళిపోయింది.

* * *

"ఇహ రెండు నెలలలో వెళ్ళిపోతాంగా, కంగారు పడకు"

"అందుకుకాదు గోపాల్, ఆమె నన్నే నమ్ముకుని ఉంది యింతవరకు. ఎన్ని ఉత్తరాలు వ్రాసినా జవాబు లేదు. కారణం తెలియదు" యింతలో పోస్టుమేన్ "రిజిష్టర్" అని కేక వేశాడు, సంతకం పెట్టి ఉత్తరం తీసుకున్నాడు కుమార్. వణుకుతున్న చేతులతో ఉత్తరం విప్పాడు

"అన్నయ్యా!

నమస్కారం. నీవు వెళ్ళి యింతకాలమైనా గిరిజకు ఉత్తరం వ్రాయలేదు. ఆమె ఎంతో ఏడ్చింది. ఆఖరుకు ఎల్లుండి ఆమె మెడలో ఉరిత్రాళ్ళవంటి మాంగళ్యం పడబోతోంది. ఒక వృద్ధుని ధర్మపత్ని కాబోతోంది. నిస్సహాయురాలు. మీ కుటుంబ శాంతి కొరకు బలైపోతోంది. నీకు ఉత్తరం వ్రాయమని ఎంతో బ్రతిమాలాను. కాని నీ నిర్లక్ష్యతకు ఆమె హృదయం గాయబడ్డది. మా అత్తగారి సంగతి నీకు తెలుసుగా? యీ వుత్తరం ఎంతో ప్రయత్నం మీద వ్రాశాను ఆలసించక అందిన వెంటనే వచ్చి గిరిజను కాపాడ వలసింది.

ఇట్లు నీ చెల్లి

"లక్ష్మి"

* * *

పెండ్లి దుస్తులతో గిరిజ చితిమీద ఉంది. కుమార్ రోజుకుంటూ వచ్చాడు. గిరిజ చితిలో జ్వాలలు రేగాయి. గిరిజ చితిపై కుమార్ ప్రవేశించాడు.

తండ్రి నారాయణరావుకు మతిపోయింది. మా అబ్బాయి పెండ్లి ! ఆశీర్వదించండని రోదించాడు.

